
సాగు కష్టాలు

- అందని పెట్టుబడి సాయం
- రేగోడ్‌లో 7,249 మంది రైతులకు ఖాతాలో జమ
- 1,485 మంది ఎదురు చూపులు


ఉల్లిగడ్డను సాగు చేస్తున్న రైతు

రేగోడ్(మెదక్): ఆన్‌లైన్‌లో కొందరి రైతుల పేర్లు రాకపోవడంతో ఇంతవరకు పలువురికి రైతుబంధు అందలేదు. వ్యవసాయంపైనే ఆధారపడిన రైతులకు ఆసరాగా ఉండాలని రైతుబంధు పథకానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ఏడాదికి ఎకరాకు రూ.10వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు. యాసంగి సాగు కోసం అందాల్సిన పదో విడత రైతుబంధు పెట్టుబడి సాయం చాలా మంది రైతులకు అందజేసినా.. ఇంకా కొంతమందికి అందక రైతుబంధు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.
రేగోడ్ మండలంలో మొత్తంగా 8,734 రైతులు ఉండగా, వీరికి యాసంగిలో సాగుకోసం పెట్టుబడి సాయం కింద రైతుబంధు రూ.8,09,33,761లు ప్రభుత్వం చెల్లించాలి. ఇప్పటి వరకు 8,715 మంది రైతులకు పెట్టుబడి సాయం మంజూరు చేశారు. కానీ ఇంకా 19 మంది రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో తీసుకోలేదని అధికారులు చెప్తున్నారు.
ఇప్పటి వరకు సుమారు మూడెకరాల వరకు ఉన్న 7,249 మంది రైతులకు రూ.4,73,04,994లను పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 1,485 మంది పెద్ద రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. యాసంగి సాగు ప్రారంభమై సుమారు నెల రోజులు కావస్తున్నా.. పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయం అందకపోవడంపై రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు మెస్సెజ్‌లు వచ్చినా.. బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాలను పరిశీలిస్తే డబ్బులు జమకాకపోవడంతో వెనుదిరగాల్సి వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం సాగు సమయంలో అందినట్లు అయితే పెట్టుబడికి ఇబ్బందులు తప్పేవని, రైతుబంధు డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకాకపోవడంతో అవస్థలు పడుతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి, త్వరగా పెట్టుబడి సాయం డబ్బులు తమకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇంకా రాలేదు



నాకు నాలుగు ఎకరాల ఆరు గుంటల భూమి ఉంది. శనగ, ఉల్లిగడ్డ పంటలు వేశా. పెట్టుబడికి రూ.1 లక్షా 50వేలు ఖర్చు అయింది. పెట్టుబడికి రైతుబంధు వస్తుందేమో అనుకుంటే ఇంకా అందలేదు. సాగుకు పెట్టుబడి కోసం చాలా ఇబ్బంది పడ్డాను. ప్రభుత్వం త్వరగా పెట్టుబడి సాయం అందించి రైతులను ఆదుకోవాలి. – అంజయ్య, రైతు, గజ్వాడ

త్వరలో వస్తాయి



రేగోడ్ మండలంలోని 8,734 మంది రైతులకు రైతుబంధు మంజూరు కోసం ప్రభుత్వానికి పంపించాం. ఇప్పటి వరకు 7,249 మంది రైతులకు పెట్టుబడి సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. మిగతా వారికి త్వరలో రైతుబంధు డబ్బులు జమ అవుతాయి. – జావిద్, ఏఓ, రేగోడ్

క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేశ్

నర్సాపూర్: తమ కాలేజీలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసి కాలేజీ(వైపర్) ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ పేర్కొన్నారు. సోమవారం కాలేజీలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్‌డే ఉత్సవాల్లో ఆయన మాట్లాడుతూ... కాలేజీలోని విద్యార్థులందరూ కలిసి మెలిసి ఉండాలని, ర్యాగింగ్ లాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. కాలేజీలో ఉన్న వసతులను వివరించారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

'నేటికి బియ్యం సరఫరా లేదు'

శివ్వంపేట(నర్సాపూర్): రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే బియ్యం నేటికి సరఫరా కాలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీ నుంచి రేషన్ దుకాణాల నుంచి సరుకులు ఇస్తున్నామని గొప్పగా చెప్పుకునే ప్రభుత్వం జనవరి నెల ప్రారంభమై 10 రోజుల గడిచినా.. రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా కాలేదన్నారు. సంక్రాంతి పండుగ దగ్గర పడుతున్న రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఆలయ వార్షికోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


నర్సాపూర్: వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీనల్లపోచమ్మ (శ్రీశీతల మాత) ఆలయ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు రమణరావు, దండు దశరథ్, జగదీశ్వర్ కోరారు. సోమవారం ఆలయం ఆవరణలో వార్షికోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 18, 19 తేదీల్లో ఆలయ 7వ వార్షికోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం యాదవ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాయిలాపూర్ ప్రాథమిక పాఠశాల తనిఖీ


పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ బుచ్చానాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ ప్రాథమిక పాఠశాలను మండల ఎంఈఓ బుచ్చానాయక్ సోమవారం ఆకస్మికి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రూ 5.45లక్షలతో చేపట్టిన మన ఊరు – మన బడి అభివృద్ధి పనులను సర్పంచ్ కుర్మ శేఖులుతో కలిసి పరిశీలించారు. పాఠశాలలో ఇప్పటికే మంచినీటి సౌకర్యం, విద్యుత్ లైన్, ఫ్లోరింగ్ బండలువేసే పనులు పూర్తిచేశారు. మిగతా పనులు సైతం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బోయిని కృష్ణ, నోడల్ అధికారి బాలరాజు, ఉపాధ్యాయులు వసంత, అంజలిదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగాల కల్పనలో కేంద్రం విఫలం'


మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుండగా, రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేశారని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. సోమవారం గజ్వేల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏటా కోటి ఉద్యోగావకాశాలను కల్పిస్తామని మాట ఇచ్చి గద్దెనెక్కాడని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించడంతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ యువత తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. మోదీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో నిరుద్యోగం పెచ్చరిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దేశంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వరుస నోటిఫికేషన్లు వేయడం బీజేపీ నేతలకు మింగుడు పడటం లేదన్నారు.

నిరుద్యోగుల వంటావార్పు


డిపో ఎదుట వంటావార్పు చేస్తున్న నిరుద్యోగులు

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్న ఘనపూర్ గ్రామ శివారులోని మద్యం ఆధారిత నిల్వ కేంద్రం(ఐఎంఎల్ డిపో)లో హమాలీ పని కల్పించాలని గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకులు సోమవారం వంటావార్పు చేపట్టారు. అంతకుముందు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న యువకులకు నర్సాపూర్ డివిజన్ సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐఎంఎల్ డిపోలో ఎక్కువ మంది పనిచేసే అవకాశం ఉన్నా.. ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీలు, డిపో మేనేజర్ బయటి యువకులకు అవకాశం కల్పించకుండా జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులు మూడు నెలలు నుంచి దీక్షలు చేస్తున్న అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువకుల ఐక్య జేఏసీ చేసిన నాయకులు మల్లేశం, మధుసూదన్ రెడ్డి, నర్సింలు, లక్ష్మీనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతును మోసం చేసిన వ్యక్తిని శిక్షించాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన ఎర్రొల్ల సత్తయ్య అనే నిరుపేద దళిత రైతును మోసం చేసిన మంగళపర్తి గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. గతంలో అమ్మిన అసైన్డ్ భూమి రికార్డుకు నమోదు చేసుకుంటామని దళిత రైతును నమ్మించి అతనికున్న పట్టా భూమిని నవీన్ గౌడ్ తన తల్లి లక్ష్మీనర్సమ్మ పేరున పట్టా మార్పిడి చేసి మోసం చేశారని ఆరోపించారు. చదువు రాని, కంటి చూపు సరిగా లేని దళిత రైతు సత్తయ్యను మోసం చేసిన నవీన్‌గౌడ్‌పై తక్షణమే మోసం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాసాయిపేట యాదగిరి మాదిగ, కొమ్ము శేఖులు మాదిగ, చెట్లపల్లి యాదగిరి మాదిగ, సర్గల పరశురాములు మాదిగ, ఎర్ర స్వామి మాదిగ, గుడ్డి రమేశ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీగా మార్చాలని వినతి

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చాలని సర్పంచ్ సుప్రజా సోమవారం మనోహరాబాద్‌లో జరిగిన కంటి వెలుగు కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందించినట్లు ఆమె తెలిపారు. టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పురాతనమైనదని, మండల కేంద్రానికి వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వస్తారన్నారు. అన్ని వసతులు ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా మార్చి ప్రత్యేక డాక్టర్లు సాంకేతిక విభాగాలు ఏర్పాటై వివిధ రకాల చికిత్సలు గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి వస్తాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, అక్కడే ఉన్న అడిషనల్ కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు ఆదేశించారన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **జీవాలపై జాగ్రత్త వహించాలి**



శివ్వంపేట(నర్సాపూర్): రైతులు మూగజీవాలపై జాగ్రత్త వహించాలని మండల పశు వైద్యాధికారి సంధ్యరాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ నివారణ చికిత్సలతో పాటు పలు దూడలకు నట్టల నివారణ మందు వేశారు. మూగజీవాలకు ఏదైన అనారోగ్య సమస్యలు తలెత్తితే పశువైద్య సిబ్బందితో చికిత్స చేయించాలని, నాటు వైద్యం వైపు వెళ్లకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ, సిబ్బంది ఉన్నారు.

◆ **కేలండర్ ఆవిష్కరణ**



అల్లాదుర్గం(మెదక్): తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం 2023 నూతన కేలండర్‌ను తహసీల్దార్ తులసీరాం సోమవారం ఆవిష్కరించారు. బంజారలకు ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు పెద్దశంకరంపేట డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ చౌహాన్ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రంజానాయక్, అల్లాదుర్గం సర్పంచ్ అంజయ్య యాదవ్, నామ్య, విఠల్, రాజు, శంకర్, మోహన్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సన్మానం**

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ నూతన తహసీల్దార్‌గా రెండురోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన భాగ్యరేఖను మర్కూక్ మండల బీఆర్‌ఎస్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, సేవా రత్న అవార్డు గ్రహీత మేకల కనకయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

◆ **ఎస్సీ హాస్టల్ సందర్శన**

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలోని ఎస్సీ హాస్టల్‌ను ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆధ్వర్యంలో హాస్టల్‌లో వసతులను పరిశీలించారు. భోజన తీరులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పరశురాంలు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆయిల్‌పామ్‌తో రైతులకు మేలు**

సిద్దిపేటరూరల్: రైతులు సాంప్రదాయ పంటలు కాకుండా ఆయిల్‌పామ్ సాగు చేయడంతో ఎంతో మేలు కలుగుతుందని ఏపీఓ స్రవంతి అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల పరిధిలో గల మాటిండ్ల గ్రామంలోని పలువురు రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ సాగును సర్పంచ్ నారాయణతో కలిసి ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న మదన్‌రెడ్డి, సునీతారెడ్డి, నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీకేతకి భ్రమరాంబ సమేత శ్రీమరకత మల్లికార్జున స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం చేపట్టిన దేవుడి కళ్యాణంలో ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, ఆయా పార్టీల నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని యాదవులు మల్లన్నస్వామికి బోనాలు ఊరేగించి సమర్పించారు.

బీటీరోడ్డు పరిశీలన


తండా రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు


చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి తండా బీటీ రోడ్డుకు రూ.కోటి 35 లక్షలు నిధుల మంజూరు కాగా పనుల నిర్వహణకు ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డును పరిశీలించారు. సోమవారం మండలంలోని కొర్విపల్లి తండా వరకు రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు, సర్పంచ్ పద్మామల్లేశ్, ఉప సర్పంచ్ సంతోశ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు లాలు నాయక్ పంతుల్యా తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం


క్రీడాకారులతో సీఐ మధు

మెదక్ మున్సిపాలిటీ: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని మెదక్ పట్టణ సీఐ మధు సూచించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ పోటీలను సీఐ ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 34 వాలీబాల్ టీమ్‌లు తరలివచ్చాయి. అనంతరం సీఐ మధు మాట్లాడుతూ.. ప్రతీ క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా ఆడాలన్నారు.

బీఆర్‌ఎస్ కేవీ ప్రధాన కార్యదర్శిగా వీరేశం


నియామకపత్రం అందిస్తున్న రాంబాబు యాదవ్

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామానికి చెందిన సిలువేరి విరేశం నియమితులయ్యారు. అందుకు సంబంధించిన నియమక పత్రం సోమవారం బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ విరేశంకు అందజేశారు.

యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు, సభ్యులు

నర్సాపూర్: ఈనెల 13, 14 తేదీల్లో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి రవి కోరారు. సోమవారం జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాల ఆవరణలో పలువురు సంఘం సభ్యులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు గణేశ్, డాకియా, అఫ్రషాహిన్, నాగుల్‌మీరా, రాజు, రాములు, శ్రీనివాస్, హేమ, హాజిరాబేగం, జయశ్రీ, ఇందమతి తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలలో క్రీడా ప్రాంగణం వద్దు'


క్రీడా ప్రాంగణం పనులను అడ్డుకుట్టున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): పాఠశాల నిర్వహణకు స్థలం సరిపడక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ఉన్న కొద్దిపాటి స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడాన్ని బీజేపీ నాయకులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి మాట్లాడుతూ.. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ప్రాథమిక పాఠశాలకు ఉన్న కొద్దిపాటి స్థలంలో ప్రభుత్వం నిర్దేశించిన తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయకూడదన్నారు. క్రీడా ప్రాంగణం మరోచోట ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫోన్‌లో వివరించామని చెప్పారు. పాఠశాలకు భూమి లేనందున ఇక్కడ గ్రామ పంచాయతీ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, పలు గ్రామాల్లో పాఠశాల భూములు, చెరువు శిఖం భూముల్లో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి బిల్లులు కాజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు అంజిగౌడ్, అంజనేయులు, శివ, సామంత్‌చారి, నవీన్, హరికృష్ణ, మహేందర్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

పొలంలో కాలి బాటలు వేసుకోవాలి


కౌడిపల్లి(నర్సాపూర్):వరినట్లును పరిశీలిస్తున్న ఏఈఓ రాజశేఖర్‌గౌడ్


చేగుంట(తూప్రాన్): ఇబ్రహీంపూర్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు వరి నాట్లు వేసేటప్పుడు కాలి(గాలి)బాటలు వేసుకోవాలని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని తునికిలో ప్రదర్శన పొలంగా ఎంచుకున్న పొలం వద్దకు వెళ్లి వరి నాట్లు వేసేటప్పుడు కాలి(గాలి)బాటలు వేయించి ఉపయోగాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వరినాట్లు వేసేటప్పుడు కాలి(గాలి)బాటలు వేసుకోవాలని తెలిపారు. ప్రతీ రెండు మీటర్లకు మధ్యలో 20సెంటీమీటర్ల కాలిబాటలు వేసుకోవాలని తెలిపారు. దీంతో పొలంలో సుడిదోమను అరికట్టవచ్చన్నారు. గాలి, వెలుతురు బాగా వీస్తుందన్నారు. కాలిబాటల గుండా పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా ఉంటుందన్నారు. సూర్యరష్మి ఎక్కువగా సోకుతుందన్నారు. తెగులు, చీడపీడలను నివారించుకోవచ్చన్నారు. రైతులు నాట్లు వేసేటప్పుడు తప్పని సరిగా కాలిబటలు వదలాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు దుర్గయ్య పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో వ్యవసాయ అధికారి హరిప్రసాద్ వరి పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం యాసంగి సీజన్‌లో వరి పంటలకు కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగులను గుర్తించినట్లు తెలిపారు. కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగుల నివారణకు రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అశోక్‌రెడ్డి, వీఆర్‌ఏ శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు


శివ్వంపేట(నర్సాపూర్): ప్రార్థనలు చేస్తున్న భక్తులు

నర్సాపూర్: పట్టణంలోని శ్రీమల్లన్న గుడి వార్షికోత్సవాలకు కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గాలిఅనిల్‌కుమార్ సోమవారం హాజరై స్వామికి పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని షంబుల్ షహీద్ దర్గాలో ప్రారంభమైన ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఉర్సు నిర్వాహకులు యూనూస్‌ఖాన్ చేపట్టిన ప్రార్థనలో పాల్గొన్నారు. ఆయన వెంట పీసీసీ డెలిగేట్స్ ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, రిజ్వాన్, మల్లేశ్, అంజిగౌడ్, నర్సింగ్‌రావు, రషీద్, అంజత్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గంగాయిపల్లిలోని సద్గురు ఓం ఫాజిల్‌నగర్ చిష్టి అప్పగారి ఆశ్రమ 41వ వార్షికోత్సవ ఉర్సు ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. చివరి రోజు వేదాంత హారతి, ఖురాన్, ప్రసాద వితరణ నిర్వహించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని ప్రార్థనలు నిర్వహించినట్లు అప్పగారి ఆశ్రమ నిర్వాహకుడు నర్సింలు చిష్టి తెలిపారు. కార్యక్రమంలో బుర్గుపల్లి ఖ్వాజా నాయబ్ రసూల్ చిష్టి అప్పగారి శిష్యులు, వట్‌పల్లి ఖ్వాజా అయజ్ వెంకట్‌దాస్, చిష్టి శిష్యులు పాల్గొన్నారు.


నర్సాపూర్: ప్రార్థనలో మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గాలి అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులకు గణిత అష్టావధాని సూచనలు

టేక్మాల్(మెదక్): మండలంలోని దనూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం డే ఫన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సులభతరంగా గణితంలోని సమస్యలను ఏ విధంగా పరిష్కరించవచ్చో గణిత అష్టావధాని చంద్రయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గణిత ఇంద్రజాలం, అంకెలతో గారడీ, గణిత చిట్కాలు, సులభ పద్దతిలో గణిత చతుర్విధ ప్రక్రియలు, గణితంతో ఆటలు, ఓరల్ క్యాలుక్యులేటెడ్ మెథడ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంజీవయ్య, ఉపాధ్యాయులు కిరణ్ లత, ప్రభాకర్, శ్రవణ్ కుమార్, రమేశ్ గౌడ్, నుస్రత్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న చంద్రయ్య